# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

**MAY - 2002**

# సంక్షిప్త వార్తలు

2002 ఏప్రియల్ 17వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లా నీలపల్లిలో (యానాం) సువార్తికుల సదస్సు జరిగెను. ఆ దినమున పలుప్రాంతముల నుండి సకాలమునకు సువార్తికులు అనేకులు కూడిరాగా, "మానవ జీవితంలో విశ్వాసము, దాని ప్రాముఖ్యత" అనే అంశము చర్చించబడెను. ఆ సదస్సుకు జాషువా గూటం గారు అధ్యక్షతవహించి ఇయ్యబడిన అంశముపై చర్చను సమర్ధవంతముగా నడిపించిరి. లక్ష్మీపోలవరం నుండి వచ్చిన సోదరులు జి. ఇశ్రాయేలు గారి ప్రార్ధనతో సదస్సు ప్రారంభ మయ్యెను. మరియు యం. యేసుదాసు (క్రొత్తకందరాడ), జి. షద్రక్ (పాలకొల్లు), యన్. మోజెస్ (కర్ఘుగోరుమిల్లి), టి.వి.యన్. కుమార్ (తూరంగి), బుర్రేయోహాను (కురెళ్లగూడెం), జాషువా గూటం గార్లు పైనుదహరించిన అంశముపై లేఖనాను సారమైన విశ్లేషణననుగ్రహించిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ గారు నీలపల్లి - యానాంలో జరిగిన, జరుగుచున్న పనిని గూర్చిన వివిరములు తెలియజేసిరి. నీలపల్లిలో సోదరులు బి. సుధాకర్‌బాబు సువార్తికునిగా పనిచేయుచున్నారు.

మానవ జీవితంలో విశ్వాసము ప్రాముఖ్యమైనది. విశ్వాసము (నమ్మకము) లేకుండా మానవ మనుగడ అసాధ్యం. మానవుడు ఉదయాన్ని లేచినప్పటి నుండి రాత్రివేళ పండు కొనేదాక విశ్వాసము చొప్పుననే తన పనులను గావిస్తాడు. అయితే దేవుడు మన నుండికోరే విశ్వాసము అట్టిదికాదు. ఏలయనగా "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలములు దయచేయువాడనియు నమ్మవలెనని బైబిలు బోధించుచున్నది" (హెబ్రీ 11:6). మరియు "మీరు దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి" యని యేసు ప్రభువు చెప్పెను (యోహా 14:1-2).

మానవుడు పాపముల నుండి రక్షింపబడవలెనంటే యేసుక్రీస్తునందు విశ్వాసముంచాలి. ఏలయనగా నేను, "ఆయననని మీరు విశ్వసింపని యెడల మీ పాపముల లోనే యుండి చనిపోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8:24). అయితే విశ్వాసమొక్కటి మాత్రమే చాలదు. దానికి విధేయత కూడ జోడించాలి. "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" (యోహాను 3:36). ఒకడు తన విశ్వాసమునకు బాప్తిస్మము ద్వారా విధేయత చూపిన తరువాత అతడు మరణపర్యంతము నమ్మకముగా యున్న యెడల నిత్యజీవ కిరీటమును పొందునను వాగ్దానము విశ్వాసికి యున్నదని చెబుతు సహోదరులు మానవ జీవితంలో విశ్వాసము యొక్క ప్రాముఖ్యతను వివరించిరి.

సదస్సుకు హాజరైన వారందరికీ నీలపల్లి క్రీస్తుసంఘము మంచివిందు నేర్పాటు చేసిరి. మంచి కృషి సల్పి సదస్సును జయకరముగా నిర్వహించిన సోదరులు

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 మే 2002 సంచిక 10

# క్రీస్తు యొక్క పునరుత్థానము

## (The Resurrection of Jesus Christ)

యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెనను మాటను ఎవరు సందేహించరు. ప్రతిదినము ఆయన వచ్చిన సంగతిని ప్రచురము చేయుచునే యున్నది. అంతేగాక, "యేసు క్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది; యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు; దీనిని బట్టియే దేవుని ఆత్మను మీరెరుగుదురు" అని బైబిలు చెప్పుచున్నది (1 యోహాను 4:2-3).

యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెను. ఆయన ఈ భూమి మీద 33½

సం॥లు జీవించెను. యూదుల ద్వేషము వలన రోమా ప్రభుత్వము వారిచే సిలువ వేయబడి ఆయన చంపబడెను. అజ్ఞానము వలన, దురభిమాన ద్వేషము వలన యూదులు ఆయనను సిలువ వేసిచంపించినను, దేవుని చిత్తమును జరిగించుచు యేసుప్రభువు యిష్టపూర్వకముగా తన్నుతాను సమర్పించుకొనెను. సరిగదా "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని" తన్ను గూర్చి ఆయన చెప్పుకొనెను (మత్తయి 20:28). "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు; ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను" అని అపొ.పౌలు పరిశుద్ధాత్మ ద్వారా సాక్ష్యమిచ్చెను (1 తిమో 2:5-6).

## ముందుగానే తెలియజేసెను

యేసు ప్రభువు సిలువపై చనిపోయి, సమాధి చేయబడి మూడవ దినమున మరణమును జయించి తిరిగిలేచెను. ఆయన చనిపోయి 3వ దినమున తిరిగిలేతునని తన శిష్యులకు ముందుగానే బోధించెను: "యోనా తిమింగిలము కడుపులో మూడు రాత్రింబగళ్లు ఏలాగుండెనో, ఆలాగు మనుష్య కుమారుడు మూడు రాత్రింబగళ్లు భూగర్భములో యుండును" అని ఆయన చెప్పెను (మత్త 12:40). "యేసు - ఈ దేవాలయమును పడగొట్టుడి; మూడు దినములలో దానిని లేపుదునని వారితో చెప్పెను. యూదులు, ఈ దేవాలయమును నలువది యారు సంవత్సరములు కట్టిరే, నీవు మూడు దినములలో దానిని లేపుదువా? అనిరి. అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను. ఆయన మృతులలో నుండి లేచిన తరువాత ఆయన ఈ మాట చెప్పెనని ఆయన శిష్యులు జ్ఞాపకము చేసికొని, లేఖనమును యేసు చెప్పిన మాటను నమ్మిరి" (యోహాను 2:19-22).

యేసుప్రభువు యొక్క శత్రువులు ఆయనను సిలువవేసి చంపినను, ఆయన సమాధిలో ఉంచబడినను, ఆయన తిరిగిలేతునని చెప్పిన మాటలు వారు మరచిపోలేదు. ఆయన సమాధి చేయబడిన మరునాడు, ప్రధాన యాజకులును పరిసయ్యులును రోమా గవర్నయిన పిలాతునొద్దకు వచ్చి "అయ్యా ఆవంచకుడు సజీవుడై యుండినప్పుడు మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినము వరకు సమాధిని భద్రము చేయు నాజ్ఞాపించుమనిరి". "అందుకు పిలాతు - కావలివారున్నారు గదా మీరువెళ్లి మీ చేతనైనంతమట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో చెప్పెను. వారువెళ్లి కావలివారిని కూడ ఉంచుకొని, రాతికి ముద్రవేసి సమాధిని భద్రము చేసిరి" (మత్త 27:62-66).

## ఆయన తిరిగి లేచెను

అయితే "ఆదివారమున తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. ఇదిగో ప్రభువు దూత పరలోకము నుండి దిగివచ్చి, రాయిని పొర్లించి దాని మీద కూర్చుండెను; అప్పుడు మహా భూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె ఉండెను. అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుట వలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. దూత ఆ స్త్రీలను చూచి - మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేదు; తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు. రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి త్వరగా వెళ్లి ఆయన మృతులలోనుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి. ఇదిగో ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లుచున్నాడు; అక్కడ మీరు ఆయనను చూతురు; ఇదిగో మీతో చెప్పితిననెను" (మత్త 28:1-7).

యేసుప్రభువు సమాధినుండి పునరుత్థానుడై లేచిన తరువాత నలువది

దినముల వరకు పలుమారులు తన శిష్యులకు అగపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక రుజువులను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనపరచుకొనెను (అపొ.కా. 1:3). "ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను. అటుపిమ్మట ఐదువందలకు పైగా ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను ... తరువాత ఆయన యాకోబుకు, అటుతరువాత అపొస్తలుందరికిని కనబడెను. అందరికిని కడపట అకాల మందు పుట్టినట్టున్న నాకును కనబడెనని" అపొ.పౌలు సాక్ష్యమిచ్చెను (1 కొరింథీ 15:4-8).

## దేవుని కుమారుడని రుజువయ్యెను

యేసుప్రభువు మృతులలో నుండి తిరిగిలేచుట వలన ఆయన దేవుని కుమారుడని మరింత బలముగా రుజువయ్యెను. "యేసుక్రీస్తు శరీరమును బట్టి దావీదు సంతానముగాను, మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింప బడెను" అని రోమా 1:7 చెప్పుచున్నది. మునుపెన్నడు ఎవడు జన్మించనిరీతిగా క్రీస్తు కన్యయైన మరియ గర్భమున బుట్టి తన జననమువలన తాను మానవుడు కాదుగాని శరీరధారియైన దేవుడని రుజువుచేసెను. మునుపెన్నడు మృతి నొందిన వాడు తిరిగిలేవనిరీతిగా క్రీస్తు తనకుతానే జీవము పోసుకొని మరణము జయించి తిరిగిలేచి దేవుడని రుజువు చేసెను. ఆయన ఈ లోకంలో యుండగా చనిపోయిన వారిని బ్రదికించారు, నిజమే. గాని వారు బ్రదికినను తిరిగి చనిపోయిరి. యేసుప్రభువైతే మరెన్నడు మరణించకుండునట్లు మరణాన్ని జయించారు. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు

ఏలాగు మృతిపొందుచున్నారో, అలాగుననే క్రీస్తు నందు అందరు బ్రదికింప బడుదురు" (1 కొరింథీ 15:20-22).

యేసుక్రీస్తు చనిపోయి తిరిగిలేచుట వలన మరణము జయించెను. "ఓ మరణమా నీ విజయమెక్కడా? ఓ మరణమా నీ ముల్లెక్కడ? మరణపుముల్లు పాపము. పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే - అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగునుగాక!" (1 కొరింథీ 15:55-57). క్రీస్తు మరణమును జయించెను గనుక, మనమును మరణమును జయించగలమనే నిర్ధారణను ఆయన మనకిచ్చెను. "యేసు - పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాస ముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికి చనిపోడు" అని చెప్పెను (యోహాను 11:25-26). దేవుడు తన అద్వితీయ కుమారుడైన క్రీస్తును మృతులలో నుండి లేపెను. ఆయన యందు విశ్వాసముంచిన వారిని కూడ ఆయన మృతులలో నుండి లేపును. "ప్రతివాడు తన తనవరుసలోనే బ్రదికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రదికింపబడుదురు" (1 కొరింథీ 15:23).

మానవుడు మరణభయము కలవాడు. నిజానికి పుట్టుట గిట్టుట కొరకే అనే సత్యాన్ని ఎరిగినవాడు. అయితే యేసుప్రభువు చనిపోయి తిరిగి లేచి నందున మానవులలో మరణభయమును తొలగించారు. ఆయన ఈ లోకానికి వచ్చినది కూడా అందుకే. "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారము మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును. జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును ఆయన రక్తమాంసము లలో పాలివాడాయెను" (హెబ్రీ 2:14-15). యేసుక్రీస్తు మరణాన్ని జయించారు గనుక ఆయన అనుచరులకు ఇప్పుడు మరణభయము లేదు. అందువలన,

వారు "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము" అని అపొ.పౌలు వలె చెప్పగలరు (ఫిలిప్పీ 1:21). "అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు చెరనుచెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవుల ననుగ్రహించెనని చెప్పబడియున్నది" (ఎఫెసీ 4:8).

మానవుడు చిరకాలము జీవించాలని కోరికగలవాడు. యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము ద్వారా దేవుడు ఆ కోరికను నెరవేర్చుచున్నాడు. గోత్రకర్త యగు యోబు, "మానవుడు మృతినొందిన యెడల అతడు మరల బ్రదుకునా?" అని యడిగాడు (యోబు 14:14).

మానవుని ప్రకృతి అవసరములను తీర్చుటకు దేవుడు తగిన యేర్పాట్లు చేసారు. మానవుడు ఆకలి తీర్చుకొనుటకు ఆహారమును, దప్పిక దీర్చుకొనుటకు దాహమును ఆయన అనుగ్రహించారు. మరణానంతరము జీవించాలనే అతని కోరికను కూడా ఆయన తీర్చారు. యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమే మన పునరుత్థానవాగ్దానము. అపొ.పౌలు యిట్లు చెప్పుచున్నాడు: "సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడుకుండ నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మా కిష్టములేదు. యేసు మృతిపొంది తిరిగిలేచెనని మనము నమ్మిన యెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువును బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువురాకడ వరకు సజీవులమైయుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదటలేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపో బడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ

మాటలచేత ఒకరినొకరు ఆదరించుకొనుడి" (1 థెస్స 4:13-17).

మానవులందరు రక్షింపబడి క్రీస్తుద్వారా దేవుడిచ్చు నిత్యజీవములో ప్రవేశించాలని ఆయన కోరుచున్నాడు. మనం మరణభయము నుండి విడిపింపబడాలంటే, యేసుప్రభువు నందు విశ్వాసముంచాలి. "విశ్వసించువాడే నిత్య జీవము గలవాడు. జీవాహారము నేనే" యని ఆయన చెప్పారు (యోహాను 6:47). పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. యేసే దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అపొ.కా. 2:38). అప్పుడాయన నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చుకొనును. "మరణపర్యంతము నమ్మకముగా యుండుము, నేను నీకు జీవకిరీటమిచ్చెదనని" ఆయన చెప్పుచున్నారు (ప్రక 2:10). యేసుక్రీస్తు మరణమును జయించి తిరిగిలేచెను. మనము ఆయన యందు విశ్వాసముంచిన యెడల మరణమును జయించగలము !!

# ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు ?

## ( Wherefore then Serveth the Law ? )

"ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను" (గలతీ 3:19).

<u>ఇక్కడ చెప్పబడిన ధర్మశాస్త్రము, మోషే ధర్మశాస్త్రము :</u>

పాతనిబంధనను గూర్చి చెప్పబడునప్పుడు సాధారణంగా ధర్మశాస్త్రము, మోషే ధర్మశాస్త్రము అనుమాటలను మనం కనుగొందుము. ఈ మాటలు మోషే ద్వారా అమలులోనికి వచ్చిన పద్ధతినంతటినీ సూచించుచున్నవి. ఈ పద్ధతిని సూచించే మాటలు కనీసం 150 మారులు క్రొత్తనిబంధనలో వాడబడినవి.

ధర్మశాస్త్రము లోపభూయిష్టమైనదయి నందున అది ఎందుకు ఈయ బడెను ? అను ప్రశ్నవేయబడెను.

<u>ధర్మశాస్త్రము లోపములు గలది :</u> "ఆ మొదటి నిబంధన లోపములేనిదైతే రెండవ దానికి అవకాశముండ నేరదు" (హెబ్రీ 8:7).

<u>ధర్మశాస్త్రము బలహీనమైనది :</u> "ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను. శరీరము ననుసరింపక ఆత్మననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విధి నెరవేర్చబడ వలెనని పాపపరిహారము నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారముతో పంపి, ఆయన శరీరమునందు పాపమునకు శిక్ష విధించెను" (రోమా 8:2-3). పరిపూర్ణ పాపక్షమాపణ ధర్మశాస్త్రములో లేనందున అది బలహీనమైనది. దేవుని బలిపీఠము మీద అర్పింపబడు అనేక బలులు అర్పించు వారి పాపములను ఏటేటా వారి జ్ఞప్తికి తెచ్చుచున్నవే గాని వాటిని తెచ్చువారికి ఎన్నడు సంపూర్ణసిద్ధి కలుగజేయలేదు (హెబ్రీ 10:1-4). ధర్మశాస్త్రము ఎవనిని నీతిమంతునిగా చేయజాలకపోయెను, నిత్యజీవము ననుగ్రహింపకపోయెను. అది దాని ప్రాథమిక బలహీనత. "జీవింపచేయ శక్తిగల ధర్మశాస్త్రము ఇయ్యబడి యున్న యెడల వాస్తవముగా నీతి ధర్మశాస్త్రమూలముగానే కలుగును" (గలతీ 3:21). అట్టి శక్తి దానిలో లేకపోయెను.

ఇట్టి కారణాలుండగా, ధర్మశాస్త్రం అసలు ఎందుకు ఇయ్యబడింది? అది

పనికిరానిదా ? నిష్ప్రయోజనమైనదా ? అట్లుకాదు గాని అదొక గొప్ప ప్రయోజనం కొరకు ఇయ్యబడెను. దాన్ని గమనించుదాం :

## ఎందుకు ఇయ్యబడెను ?

ఎ) అతిక్రమములను బట్టి ధర్మశాస్త్రం ఇయ్యబడెను: "ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను" (గలతీ 3:19). మానవజాతి అంతటికీ పాపము అనే లక్షణం వున్నది. ఆనాడు అనేక జనాంగములు విగ్రహారాధన లోనికిపోయి ఈలోకాన్నంతటినీ కలుషితం చేయుచున్నారు. ధర్మశాస్త్రము ద్వారా దేవుడు విగ్రహారాధనను నిరోధించి, తాను వాగ్దానము చేసిన సంతతి (క్రీస్తు) వచ్చువరకు తానేర్పరచుకొనిన జనాంగమును విశ్వాసములో నిలుకడగా యుంచుటకు ప్రయత్నించెను (గలతీ 3:19,16). గనుక ఇశ్రాయేలు ప్రజలు దేవునికి నమ్మకముగా యుండునట్లు మోషే ధర్మశాస్త్రములో కఠినమైన ఆజ్ఞలు, కఠినమైన శిక్షలు ఉండెను. విమోచన కర్తగా క్రీస్తు తన పనిని సంపూర్తి చేయాలంటే, ఆయన ఉద్భవింపబోయే జనాంగము విగ్రహములను గాక నిజ దేవుని యందు విశ్వాసముంచి ఆ[illegible]నను ఆరాధించు వారైయుండవలసి వచ్చెను.

బి) వాగ్దానము చేయబడిన సంతతియగు క్రీసు వచ్చువరకు అబ్రాహాము సంతతిని ఒక ప్రత్యేక జనాంగముగా యుంచుటకు ధర్మశాస్త్రము ప్రయోజనకారి ఆయెను : "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు - సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే - నీ సంతానమునకును అనెను. ఆ సంతానము క్రీస్తు. నేను చెప్పునదేమనగా నాలుగువందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు

దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు. ఆ స్వాస్థ్యము ధర్మశాస్త్ర మూలముగా కలిగినయెడల ఇక వాగ్దాన మూలముగా కలిగినదికాదు. అయితే దేవుడు అబ్రాహామునకు వాగ్దానము వలననే దానిని అనుగ్రహించెను. ఆలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఈయబడెను. అది మధ్యవర్తిచేత దేవదూతల ద్వారా నియమింపబడెను" (గలతీ 3:16-19).

యిది అత్యవసరం, ఏలయనగా అబ్రాహాము సంతతి ద్వారా భూలోకము లోని సమస్త జనాంగములు ఆశీర్వదించబడునని దేవుడు తనకు వాగ్దానము చేసెను (ఆది.కా. 12:3). ఆ సంతతి క్రీస్తే (గలతీ 3:16).

మోషే యుగములో యున్న ఈ జనాంగము యొక్క ప్రత్యేకత యూదులను మిగతా జనాంగములను విడదీసి వేరుపరచిన అడ్డుగోడయని చెప్పబడెను (ఎఫెసీ 2:14).

దేవుడు అబ్రాహాముకు చేసిన భూసంబంధమైన వాగ్దానము నెరవేరా లంటే, ధర్మశాస్త్రము అవసరమాయెను. "నిన్ను గొప్పజనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు" (ఆది.కా. 12:2). ఈ వాగ్దానము వలన, దానిని బట్టియే ధర్మశాస్త్ర మీయబడెను. అది వాగ్దానము చేయబడిన 430 సం॥ల తరువాత ఈయ బడెను (గలతీ 3:16-17). ఆ వాగ్దానము నెరవేరునట్లు దేవుడు ఇశ్రాయే లీయులకొక ప్రభుత్వమును, మోషే ధర్మశాస్త్రమును అనుగ్రహించెను. అది వారిని మత సంబంధముగాను, రాజకీయముగాను సంరక్షించెను, నడిపించెను.

<u>ధర్మశాస్త్రము పాపము యొక్క ఘోరతత్వమును చూపించెను :</u> "అయితే

పాపము ఉత్తమమైన దాని మూలముగా నాకు మరణము కలుగ జేయుచు పాపము పాపమైనట్లు అగుపడు నిమిత్తము, అనగా పాపము ఆజ్ఞ మూలముగా అత్యధిక పాపమగు నిమిత్తము అది నాకు మరణకరమాయెనని" అపొ.పౌలు చెప్పెను (రోమా 7:13). ధర్మశాస్త్రము పరిపూర్ణ నైతిక సూత్ర సంబంధమైనది గనుక దేవుని పరిశుద్ధతను, మానవుని పాపపుతత్వాన్ని బాహాటముగా బయలు పరచెను. అందువలన మానవునికి దైవిక విరుగుడు యొక్క అవశ్యకతను విశదపరచెను.

ధర్మశాస్త్రము రాబోవు మేలులను బయలుపరచు ఛాయగా పనిచేసెను (హెబ్రీ 10:1).

రాబోవు మేలులను వర్ణించుటకుగాను దేవుడు మోషే ధర్మశాస్త్రమును ఒక ఛాయగా, అలంకారరీతిగా వినియోగించెను. "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1 కొరింథీ 10:11).

ఉదా :-- ఇశ్రాయేలీయులు అరణ్యమార్గమున చేసిన ప్రయాణము క్రొత్త నిబంధనలో దేవుని ప్రజల యాత్రకు సూచనయై యున్నది. పాతనిబంధనలో ప్రత్యక్ష గుడారము, దేవాలయము క్రొత్త నిబంధనలో క్రీస్తు సంఘమునకు సూచనయై యున్నవి. పాతనిబంధనలో వధింపబడిన గొర్రెపిల్ల, దేవుని గొర్రె పిల్లయైన క్రీస్తుకు సూచనయై యున్నది. హాగరు, ఇష్మాయేలు, శారా, ఇస్సాకులు పాత, క్రొత్త నిబంధనలకు సూచనయై యున్నారని వివరిస్తు పౌలు మనకు బోధించు చున్నాడు (గలతీ 4:22-31). రాబోవు క్రీస్తుకు సూచనగా మోషే మనకగుపడు చున్నాడు (ద్వితీ 18:5; అపొ.కా. 3:22,23). గనుక క్రీస్తు మార్గము నెరుగ యోచించువాడు తప్పక మోషే ధర్మశాస్త్రమును కూడ ఎరుగవలెను.

మోషే ధర్మశాస్త్రము ఒక ప్రాథమిక బడిపంతులుగా పనిచేసెను. క్రీస్తు నొద్దకు మనలను తెచ్చుటకు అది ఒక బాలశిక్షకుని పనిచేసెను. "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులముగా తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాల శిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడి అయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీ 3:24-25). క్రీస్తును ఈలోకము గ్రహించుకొని అంగీకరించునట్లు పాత నిబంధన ఒక ప్రాథమిక బడిపంతులుగా పనిచేసింది. క్రీస్తునొద్దకు అది నడిపించింది. దాని పని అదిచేసేసింది.

ధర్మశాస్త్రము దాని ప్రయోజనమును నెరవేర్చేసింది గనుక ఇక అమలులో లేదు.

1. వాగ్దానము చేయబడిన సంతతి (క్రీస్తు) వచ్చువరకు అది యుండెను. క్రీస్తే ఆ సంతతి. ఆయన దానిని సిలువకు మేకులతో కొట్టి అడ్డము లేకుండా దానిని ఎత్తివేసారు (కొలస్స 2:14). "ఆ రెండవ దానిని స్థిరపరచుటకు ఆయన మొదటి దానిని ఎత్తి వేసెను" (హెబ్రీ 10:9).

2. ప్రస్తుత కాలమందు మనము మోషేనుగాక క్రీస్తును వెంబడించాలి; ఆయనకు విధేయత చూపాలి. యిది మరింత శ్రేష్ఠమైనది (మత్త 17:5; హెబ్రీ 1:1,2; అపొ.కా. 3:22,23). మనము క్రీస్తు మాటలను శ్రద్ధగా వినవలసిన బాధ్యత కలిగిన వారము.

3. ధర్మశాస్త్రము కొట్టివేయబడినందున, ఒక విశ్వాస ప్రమాణముగా ఎవడును దాని యొద్దకు మరలరాదు. "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా

వేరుచేయబడి యున్నారు; కృపలో నుండి తొలగిపోయి యున్నారు" అని బైబిలు చెప్పుచున్నది (గలతీ 5:4).

మోషే మార్గం గతించిపోయింది. ఇప్పుడు మనం క్రీస్తును వెంబడించాలి. ఆయనే మనముక్తి మార్గము.

— లీరోయ్ బ్రౌన్లో.

## ఆజ్ఞాపించని అగ్ని
(Unauthorised Fire)

"అహరోను కుమారులైన నాదాబు, అబీహులు తమ తమ ధూపార్తులను తీసికొని వాటిలో నిప్పులుంచి వాటి మీద ధూప ద్రవ్యము వేసి, యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యెహోవా సన్నిధిని మృతిబొందిరి" (లేవీ 10:1-2).

దేవుడు ఈ యిద్దరు యాజకులను ఎందుకు చంపారు? వారు ప్రధాన యాజకుడైన అహరోను కుమారులు! దేవుని ప్రజల నాయకుడైన మోషే వారి చిన్నాన్నయే! అయినను దేవుని సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసింది !

## వారు పాపం చేసారు

వాళ్లు యాజకులేగదా ? వారేం పాపం చేసారు ? అవును వారు యాజకులే. వారు ధూపద్రవ్యము వేయుటలో తప్పు చేసారా ? ధూపద్రవ్యము వేయుట తప్పుకాదు. వారు చేతబూనిన ధూపార్తులు సరియైనవి కావా ? అవి సరియైనవే ! గాని వారు దేవుని మాటను నిర్లక్ష్యము చేసారు. వారు తమ స్వంత ఉద్దేశప్రకారము దేవుని నారాధింపబూనుకొన్నారు. కాని పద్ధతిని ఎంచుకొన్నారు. దేవుడాజ్ఞాపించిన దానిని వారు లక్ష్యపెట్టలేదు. దేవుడాజ్ఞాపించిన రీతిగా మానవుడు విధేయత చూపనప్పుడు, దేవునినే అగౌరపరుస్తాడు.

## వారు మృతినొందారు

దేవుడాజ్ఞాపింపని వేరొక అగ్నిని వారాయన సన్నిధికితేగా దేవుడు వారిని మొత్తారు. వారక్కడే మరణించారు. ఈ మాత్రం దానికే ఇంత పెద్దశిక్షా ? యని కొందరనుకోవచ్చు. వారికి ఇంకొక తరుణం ఇయ్యవచ్చును గదా? అని తలంచవచ్చు. "పాపము వలన వచ్చు జీతము మరణము" అని పరిశుద్ధాత్ముడు పలికారు (రోమా 6:23). దేవుని చిత్తానికి విధేయత చూపనందున మరణం సంభవిస్తాదని గ్రహించేవారు చాల తక్కువ మందే నేడున్నారు.

## మనకో పాఠం

మనం దేవుని నైతిక ఆజ్ఞలను మాత్రమే గాక, ఆయన ఆజ్ఞాపించు విధులన్నిటికీ విధేయత చూపాలి. ఆయనే మార్గము, సత్యము, జీవము (యోహాను 14:6). ఆయన చూపించే మార్గము క్రొత్తనిబంధనలో యున్నది (హెబ్రీ 1:1,2). మనం దేవుని నారాధించునప్పుడు సరియైన మనస్తత్వము

(స్వభావము) కలిగి ఆరాధించాలి. ఆయన ఎట్లాజ్ఞాపించారో అట్లే చేయాలి. దానికి కలుపకూడదు, దాని నుండి తీసివేయకూడదు. ఉదాహరణకు :- క్రైస్తవులు ఆరాధనలో క్రొవ్వొత్తులు వెలిగించాలని, సాంబ్రాణి పొగలు అర్పించాలని ఎక్కడు వున్నది? బైబిలులో ఎక్కడాలేదు ! ఆరాధనలో వాద్యాలు వినియోగించాలని ఎక్కడవున్నది ? బైబిలులో ఎక్కడా లేదు.

దేవుని విధానములో మానవుని విధానము ఎన్నడూ ప్రవేశపెట్టకూడదు. నాదాబు అబీహులు తమ యిష్టం వచ్చిన అగ్నితో ఆరాధించాలని ప్రయత్నించారు, మరణించారు. నేడు ముంచడానికి బదులు మానవులు చిలకరింపు ప్రవేశ పెట్టారు. యేసుక్రీస్తు తన స్వరక్తముతో సంపాదించిన సంఘానికి మానవులు తమ పేర్లు పెట్టుకొన్నారు. దేవుని వాక్యానికి బదులు మానవ పారం పర్యాచారములను ఆరాధనలో ప్రవేశపెట్టారు. అదంతా వ్యర్థమే. తత్ఫలితముగా వారు దేవుని కోపమును, మరణమును వారిమీదికి తెచ్చుకొను చున్నారు.

నాదాబు అబీహుల నుండి ఒక పాఠం మనం నేర్చుకోవాలి. దేవుడేమి ఆజ్ఞాపించారో, అట్లే చేయుట మనకు మేలు.

# దేవుడున్నాడని నీవు నమ్ముదువా?

## ( Do you believe there is a God? )

### ఆయన వున్నాడనడానికి 15 కారణాలివిగో :

<u>మొదటిగా,</u> సూర్యునిబట్టి ఆయనవున్నాడని నమ్మవచ్చును. సూర్యుడు నిరంతరము మండుచు యుంటాడు. దాన్ని మండించే శక్తిని నిత్యము దానికి ఎవరు సరఫరా చేయగలరు? దేవుడు మాత్రమే.

<u>రెండవదిగా,</u> జీవమే ఆయన వున్నాడనడానికి ఆధారం. నిర్జీవమైన విత్తనాన్ని మానవుడు తయారు చేయగలడు. గాని సహజ విత్తనంలో జీవాన్నిచ్చే వాడెవరు? దేవుడే.

<u>మూడవదిగా,</u> జ్ఞానం ఒక ఆధారం. అసలు జ్ఞానం ఎక్కడనుండి వచ్చినది? మానవుని కంటే వున్నతమైన స్థావరం నుండి జ్ఞానం వచ్చివుండాలి. భూరాసులు వారు నేర్చుకొన్నవాటిని గూర్చి కొంతమాత్రమే ఎరుగుదురు. గాని దేవునికి సమస్తము ఎరుకే.

<u>నాల్గవదిగా,</u> భూభ్రమణం ఒక ఆధారం. భూమి సూర్యుని చుట్టూ తిరిగేటట్లు సరియైన కక్ష్యలో (orbit) ఎవరుంచారు? తద్వారా భూమిపై వివిధ ఋతువులు కలిగేటట్లు దాని కక్ష్య నెవరు నిర్ధారించారు? భూమిపై జీవం కొనసాగింపబడేటట్లు దాని కక్ష్యనెవరు నిర్ధారించారు? దేవుడు మాత్రమే.

<u>అయిదవదిగా,</u> మానవుడు కల్పించుకొనిన పరిణామ సిద్ధాంతాలే ఒక కారణం. భూమిపై జీవం ఎట్లు ఉద్భవించిందో చెప్పే పరిణామసిద్ధాంతాలు అనేకము

ఉన్నాయి. అవి ఒకదానితో మరొకటి పొసగవు. గనుక ఈ పరిహాస సిద్ధాంతాల వలనగాక, ఉన్నతుడైన దేవుని వలన జీవము, మానవుడు కలిగారని నమ్ముట సులభం.

<u>ఆరవదిగా,</u> సమస్తము శూన్యము నుండి కలిగింది. (Everything came from nothing!) గాని మానవుడు మాత్రం శూన్యము నుండి దేనినీ చేయలేడు. దేవుడొక్కడే సమస్తానికి ఆధారభూతుడు.

<u>ఏడవదిగా,</u> కోటానుకోట్ల కాంతి సంవత్సరముల మైళ్ల దూరములో యున్న నక్షత్రాలు మరొక ఆధారం. సర్వశక్తుడైన దేవుడొక్కడు మాత్రమే వాటన్నిటికీ కర్తయై యుండాలి.

<u>ఎనిమిదవదిగా,</u> బైబిలే ఒక గొప్ప రుజువు ! అది మానవ పాత్రులచే లిఖించబడి క్రోడీకరించబడి యుండలేదు. ఈ పరిపూర్ణ గ్రంథాన్ని వ్రాయుటకు 37 తరములు పట్టింది. దేవుడే దానికి కర్తయై యుండాలి !

<u>తొమ్మిదవదిగా,</u> "దేవుని మనం చూడలేము గదా?" అని కొందరంటారు. అయితే మనం చూడలేని సంగతులు బోలెడన్ని వున్నాయి గదా? మన తలంపులు, గాలి, ప్రాణవాయువు, ప్రేమ, కాలము, రోదసీ, భవిష్యత్తు, గతము వగయిరాలు. వీటిని మనం చూడలేము, గాని అవి మన చుట్టూ యున్నాయి. అయితే ఆత్మయై యున్న దేవుడు కూడా మనచుట్టూ యున్నారని నమ్ముట సమంజసము కాదా?

<u>పదవదిగా,</u> నానా క్రిములు, కీటకాలే గొప్ప ఆధారం. యిది వింతగా కనబడవచ్చు గాని దేవుడున్నాడని అనుక్షణం అవి మనకు జ్ఞాపకం చేస్తూనే వుంటాయి. కోటానుకోట్ల క్రిమికీటకాలు పనిచేసే విధానం, తినే సంగతులు, వాతావరణంలో చలించే స్థితిగతులను ఎవరు నిర్ణయించారు? అవన్నీ అకస్మాత్తుగా

అదుపు తప్పి మనమీద పడితే? మానవజాతి నంతటినీ 30 నిమిషాల్లో అవి నాశనం చేసేస్తాయి ! అయితే వాటిని సృజించిన నాటి నుండి ప్రాకృతి స్వభావాన్నిచ్చి (instinct) దేవుడు వాటిని వాటి పరిధులలో యుంచుచున్నారు.

<u>పదకొండవదిగా,</u> భూమి మీదనున్న వృక్షాదులు, పశుపక్ష్యాదులు ఒక కారణం. కొన్ని మొక్కలు, జంతువులు విషపూరితమైనవి. ఆ విషం మరొకరిని చంపుతాది. గాని విషపూరితమైన మొక్కలు, జంతువులు మాత్రం వాటిని భరిస్తునే యుంటాయి. వాటివాటి జాతి ప్రకారం ఉద్భవిస్తూనే యుంటాయి. అయితే వాటిలో వున్న విషం మిగతా మొక్కలకు, జంతువులకు ప్రాకితే? ప్రతి మొక్క, ప్రతి జంతువు విషపూరితమై మానవజాతి నంతటినీ నాశనం చేసేసి యుండును. అయితే సర్వజ్ఞానియైన దేవుడు దానినెరిగి దైవిక భద్రతను మానవునికి కలుగజేసాడు.

<u>పన్నెండవదిగా,</u> ఒక చిన్న ప్రయోగం. ఒక గడియారాన్ని ముక్కముక్కలుగా విడదీసేయ్. దానిలోని స్ప్రింగ్‌లు, స్క్రూలు, చక్రాలు, ముళ్లు వగయిరా అన్ని విడదీసేసి ఒకపెట్టెలో వుంచి, ఆ పెట్టెను గట్టిగా గిరగిరా త్రిప్పి, క్రింద పడవేసేస్తే? ఆ గడియారం లోని భాగాలన్నీ వాటికవే మళ్లీ గడియారం లాగా తయారవ్వాలంటే నీవు ఈలాగ ఎన్ని సార్లు చేయవలసి వస్తాది? దేవుడు లేడనుకొనేవారు ఎంత ప్రయత్నించినా గడియారంలోని వివిధ భాగాలన్నీ కలిపి వాటికవే గడియారం కాలేవు. జ్ఞానియైన మానవుడు దేవునియందు తప్పక విశ్వాసం కలిగియుండాలి. ఆయన మాత్రమే ఈ బ్రహ్మాండమైన విశ్వాన్నంతటినీ చేసి క్రమబద్ధముగా చలింప జేయుచున్నాడు.

<u>పదమూడవదిగా,</u> గురుత్వశక్తి (Gravity) ఒక ఆధారం. గురుత్వశక్తి యొక్క ఉనికియే దేవుని ఉనికిని చాటుచున్నది. ఉదాహరణకు, నేటి మన కరెంటు సప్లయివలె గురుత్వశక్తి కూడ అప్పుడప్పుడు ఆగిపోతూయుంటే? దేవుడు లేకపోతే

అదట్లు జరుగవచ్చు. గురుత్వశక్తి ఒక్కసారే ఆగిపోతే మానవుడు పై నుండి క్రిందికి పడి ముక్కముక్కలవుతాడు; ఎముకలన్నీ విరగ్గొట్టుకొంటాడు. లేదా గాలిలో తేలిపోయి ఒక బుడగలాగ పైపైకి తేలుతూ రోదసీలోకి పోతాడు! గాని దేవుని శక్తే గురుత్వశక్తిని అదుపులో యుంచుచున్నది. దేవుని వలె గురుత్వ శక్తిలో కూడ మార్పుండదు.

<u>పద్నాలుగవదిగా,</u> మానవునికున్న గొప్ప మేధస్సే ఒక కారణం. ఆదాము ఏదో ఒక ఏక్సిడెంట్ వలన వివేక విశిష్టతలు గల జీవి కాలేదు. ప్రకృతిలో యున్న కోట్లాది జీవరాసులలో మానవుడొక్కడే మాట్లాడగలడు, వ్రాయగలడు, చదువ గలడు, వివేచించగలడు. పరిణామము వలన భూమిపై వివిధ జీవరాసులు కలిగియుంటే, మానవుని వలె జంతువులు కూడ చదవడం, వ్రాయడం, మాట్లాడడం, ఆలోచించడం చేసి యుండేవి. అయితే ఈ భూమి నిలిచి యున్నంత వరకు మిగతా జీవరాసులపై అధికారాన్ని ఆధిపత్యాన్ని మానవునికే దేవుడిచ్చాడు.

<u>పదిహేనవదిగా,</u> ఈ జీవనానంతరం మానవునికి బహుమతియో, శిక్షో తప్పక ఉండియుండాలి. ఎందువలన? అని నీవడుగవచ్చు. ఎందువలనంటే చాల మందికి ఈ లోకంలో న్యాయం జరుగకపోవచ్చు. వారికి బహుమతియో లేక శిక్షయో సంభవింపకపోవచ్చు. లక్షలాది ప్రజలను చంపిన హిట్లరుకు ఈ లోకంలో ఎవరు తీర్పుతీర్చనేలేదు. దుర్మార్గులు శిక్షను తప్పించుకొనుట న్యాయము కాదు. మరియు సన్మార్గులు అన్యాయంగా శిక్షింపబడుట కూడా సరికాదు. న్యాయంగా తీర్పువాడొక్కడే, ఆయనే దేవుడు!

*"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను"* (ఆది.కా.1:1).
*"సమస్తమును నిర్మించినవాడు దేవుడే"* (హెబ్రీ 3:3).

"ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవని విశ్వాసము వలన గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ 11:3).

"దేవుడులేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" (కీర్తన 14:1).

"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్నువెదకు వారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6).

# యేసుక్రీస్తు యొక్క అధికారము
## ( The Authority of Jesus Christ )

అధికారము అనుమాట అధిపత్యమును, పరిపాలనను, సంపూర్ణస్వేచ్ఛను, పూర్తి హక్కును సూచించును. రక్షించుటకును, శిక్షించుటకును, ఇచ్చుటకును, తీసికొనుటకును ఈ అధికారము ఉపయోగపడును. లోకరక్షకుడును, కరుణామయుడునునైన యేసుక్రీస్తునకు సర్వాధికారము ఉన్నది. క్రీస్తు మరణమును జయించి పరలోకమునకు వెళ్ళుటకు ముందు తన శిష్యులతో తన అధికారమును గూర్చి చెప్పెను; "అయితే యేసు వారి యొద్దకు వచ్చి పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది" (మత్త 28:18). "పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో

గాని ప్రతీవాని మోకాలును యేసు నామమున వంగాలి" (ఫిలిప్పి 2:9,10). క్రీస్తు యొక్క అధికారమును కొంత పరిశీలింతము :

**1) క్రీస్తునకు ఈ సృష్టిపైన అధికారము కలదు :** ఆయన సృష్టికర్త. సమస్తమును ఆయన సృజించెను. "ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవి, అదృశ్యమైనవి అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయనను బట్టియు సృజింపబడెను" (కొలస్స 1:15-16). "ఈయన ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:2). "సమస్తమును ఆయన మూలముగా కలిగెను" (యోహాను 1:2). యేసుక్రీస్తునకు ఈ సృష్టిపై అధికారము కలదు. అందుకై ఆయన సముద్రము పై నడిచెను (మత్త 14:25). నీళ్లను ద్రాక్షారసముగ మార్చెను (యోహాను 2:7-10). గాలి తుఫానును నిమ్మళ పరచెను. 5 రొట్టెలు 2 చిన్న చేపలతో 5000 మందికి ఆహారము పెట్టెను. మరియు వారు తృప్తిగా తినిన తరువాత 12 గంపలు ఆహారం మిగిలెను. నానావిధములైన రోగులందరిని స్వస్థపరచెను. ఎన్నో అద్భుత కార్యములు, సూచక క్రియలను చేసి తనకు ఈ సృష్టిపై అధికారమున్నదని నిరూపించెను. "మరియు మనకు ప్రభువు ఒక్కడే ఆయన యేసుక్రీస్తు . ఆయన ద్వారా సమస్తమును కలిగెను. మనము ఆయన ద్వారా కలిగినవారము" (2 కొరింథీ 8:6). కనుక యేసుక్రీస్తు పూజ్యనీయుడు - సృష్టినిగాక సృష్టికర్తను పూజించాలి.

**2) యేసుక్రీస్తునకు మరణముపై అధికారము కలదు :** సమాజమందిరపు అధికారియైన యాయీరు కుమార్తె చనిపోగా యేసు - ఆమె నిద్రించుచున్నదే గాని చనిపోలేదని చెప్పి ఆమె చెయ్యిపట్టుకొని చిన్నదానా లెమ్మనిచెప్పగా ఆమె ప్రాణము తిరిగివచ్చెను గనుక వెంటనే ఆమె లేచెను" (లూకా 8:52-55). నాయీను అను

ఊరిలో విధవరాలి కుమారుడు చనిపోగా వాడు పాతిపెట్ట బడుటకు మోసుకొని పోబడుచుండెను. యేసు ఆ పాడెను ముట్టగా మోయుచున్న వారు నిలిచిరి. ఆయన చిన్నవాడా లెమ్మని చెప్పగా వాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను" (లూకా 7:11-17). మరియు, మార్తల సోదరుడు లాజరు చనిపోగా అతడు పాతిపెట్టబడి నాలుగు దినములాయెను. అతని దేహము వాసన కొట్టుచున్నది. అయినను యేసు ఆ సమాధి వద్దకు వెళ్లి రాతిని తొలగించుడని చెప్పి - లాజరూ బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా అతడు బ్రతికి ప్రేత వస్త్రములతో బయటికి వచ్చెను. కనుక యేసునకు మరణముపై అధికారం కలదు. చివరకు మానవ పాపాలు కడుగు నిమిత్తము వారిని రక్షించునిమిత్త ఆయన చనిపోయెను. అయితే మూడవ దినమున మరణమును జయించి తిరిగి లేచెను (లూకా 24:4,5). ఆయన యందు విశ్వాసముంచిన వారు కూడా చనిఫోయినను మరల బ్రతుకుదురు అని యేసు నిరూపించెను.

**3) క్రీస్తు రాజ్యమును కలిగియుండి అధికారము కలిగియుండెను :** నేడు మతశాఖల వారు యేసురాజ్యము ఇప్పుడులేదని ఆయన రెండవరాకడలో యెరూషలేములో సింహాసనం వేసుకొని నీతిమంతులను వెయ్యేండ్లు పాలన చేయునని నమ్ముచున్నారు. ఈ నమ్మకము దేవుని వాక్యమునకు విరుద్ధముగా యున్నది. నేడు యేసు రాజ్యము చేయుచున్నాడు. ఆయన రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు అని పిలువబడుచున్నాడు. అయితే యేసు యొక్క రాజ్యము భూసంబంధమైనది కాదు. యేసు యొక్క రాజ్యము ఎప్పుడు ఆరంభమగునో ప్రవక్తలు ముందుగానే ప్రవచించిరి. దానియేలు 2:44 ప్రకారం ఆ రాజ్యం రోమీయుల పరిపాలనలో స్థాపింపబడవలెను. ఆయన భుజముల మీద రాజ్యభార ముండునని యెషయా ప్రవచించెను (యెషయా 9:6). బాప్తిస్మ మిచ్చు యోహాను పరలోక రాజ్యము సమీపించియున్నదని ప్రవచించెను (మత్త 3:1). రాజ్యమును గూర్చి యేసు ప్రకటించెను (మత్తయి 4:17). దేవుని రాజ్యము

మీ మధ్యనే యున్నదని యేసు చెప్పెను (లూకా 17:21). రాజ్యము రాకడకొరకు ప్రార్థించుమని శిష్యులకు చెప్పెను (మత్తయి 6:10). శిష్యుల జీవితకాలంలోనే రాజ్యము వచ్చునని ఆయన చెప్పెను (మార్కు 9:1). పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు పేతురుకిచ్చెను (మత్తయి 16:18,19). రాజ్యము బలముతో వచ్చును. ఆ బలము లేక శక్తి పొందుటకు యెరూషలేములో ఉండి కనిపెట్టుడని శిష్యులకు చెప్పెను (మార్కు 9:1; లూకా 24:49). ఆ బలము, శక్తి పెంతెకొస్తు పండుగ దినమున శిష్యులమీదికి వచ్చెను. పేతురు తన ప్రసంగముతో రాజ్యము యొక్క తలుపులు తెరెచెను, ఆ రోజు మూడువేల మందితో రాజ్యము స్థాపించ బడెను.

ఫిలిప్పు దేవుని రాజ్యము గూర్చి ప్రకటించుచుండెను (అపొ.కా. 8:12). మనము రాజ్యనివాసులుగా చేయబడినాము అని పౌలు చెప్పెను (కొలస్స 1:13). యేసు తన రెండవ రాకడలో తన తండ్రియైన దేవునికి రాజ్యం అప్పగించెను (1 కొరింథీ 15:24). ఇప్పుడు రాజ్యము లేకుండా ఆయన దేవునికి దానినెట్లు అప్పగించును? యోహాను ఆ రాజ్యములో పౌరుడుగా ఉండెను (ప్రక 1:6,9). యేసు భూసంబంధమైన రాజుకాడు (యోహాను 18:36). ఆయన రాజ్యం ఆత్మ సంబంధమైనది. దానికి వెయ్యేండ్లు కాలం అనెడి కొలమానం లేదు. ఆయన రాజ్యం చిరకాలము నిలుచును (దాని 2:44). ఆ రాజ్యమే క్రీస్తు సంఘము. నీవు క్రీస్తుసంఘ సభ్యుడవైతే నీవు క్రీస్తు రాజ్యములో పౌరుడుగా ఉందువు.

<u>రాజ్యానికి ఉండవలసిన లక్షణాలు</u> :- రాజు కావాలి - క్రీస్తు రాజైయున్నాడు (ప్రక 19:16; 17:14). భూభాగముకావాలి - సర్వలోకము (మత్త 28:18,19). పౌరులు కావాలి - క్రైస్తవులు రాజ్యపౌరులు (అపొ.కా. 11:26; ప్రక 1:6). చట్టము కావాలి - క్రొత్తనిబంధన మన చట్టము (యాకోబు 1:25; కొలస్స 1:28). ఈ విధంగా యేసుక్రీస్తు తన రాజ్యముపై అధికారము కలిగి యున్నాడు.

మతశాఖలవారు బోధించునట్లు భూమిపై రాజ్యము స్థాపింపబడుటకు

ఈ సృష్టియావత్తు కాలిపోవును. మనష్యులు ఒక్కసారే మృతిపొందుతారు తరువాత తీర్పుజరుగును (హెబ్రీ 9:27). అప్పుడు పరలోకానికి గాని నరకానికి గాని వెళతారు.

నీవు ఇంకనూ రాజ్యములో లేక క్రీస్తుసంఘములో సభ్యుడవు కానట్లు యితే నేడే యేసునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. యేసుదేవుని కుమారుడని ఒప్పుకొనుము, పాపక్షమాపణ నిమిత్తము నీటిలో బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవు క్రీస్తు అధికారమునకు లోబడినవాడవు అగుదువు. ఆయనకు లోబడిన వారిని ఆయన రక్షించును (హెబ్రీ 5:8-10).

-- దేవరపల్లి చిరంజీవి
బండార్లంక.


## మీ సంఘమునకు ఒక మంచి అవకాశము !!

మీ స్థానిక సంఘములో చదువుకొన్న వారందరి దగ్గరా బైబిలు వున్నాదా? లేకపోయినచో వారందరికీ బైబిళ్లను మేము ఉచితముగా ఇయ్యగలము. వారిని **బేసిక్ బైబిలు కోర్సు** లో చేర్పించండి. దానిలో 28 పాఠములను పూర్తి చేస్తే వెంటనే బైబిలు ప్రతిని ఉచితంగా వారికి అందజేస్తాము. వారి అడ్రసులను వారి అనుమతితోనే దిగువ చిరునామాకు పంపండి :

**SATYA VANI**
P.o. Box. 80, Kakinada - 533 001.

బి. సుధాకరబాబును అందరు అభినందించిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ గారి ప్రార్ధన ద్వారా నాటి సదస్సు ముగిసెను. హాజరైన వారందరు సంతోషముతో తమ గృహములకు తరలి వెళ్లిరి.

ఏప్రియల్ 19వ తేదీ శుక్రవారం బిక్కవోలు బైబిలు స్కూలు వారి ఆధ్వర్యమున బిక్కవోలులోనే ఆ స్కూలు ఆవరణలో సువార్తికుల సహవాస కూడిక జరిగెను. ఆ కూడికకు బైబిలు స్కూలు విద్యార్థులు, లెక్చరర్లు, మరియు పలుప్రాంతములలో సువార్త చాటుచున్న సహోదరులు కూడివచ్చిరి. ఆనాడు అపొ.పౌలు యొక్క సువార్త పరిచర్య అను అంశము ధ్యానించబడెను. ఉదయకాలపు సమావేశమునకు బైబిలు స్కూలు ఫాకల్టీ మెంబరు సోదరులు యం. సూర్యారావ్ గారు అధ్యక్షతవహించి చక్కగా నడిపించిరి. ఆ సహవాసకూడిక బైబిలు స్కూలు డైరక్టర్ యస్. జాన్‌గారి ప్రార్ధనతో ఆరంభమాయెను. ఆరికరేవుల నుండి వచ్చిన సోదరులు జి. బాబ్జీ గారు లేఖన భాగమును చదివి వినిపించిరి. తదుపరి లొల్లలో పనిచేయుచున్న సోదరులు కె. ప్రసాదరావ్ గారు ప్రార్ధన చేసిరి. మధ్యాహ్నకాల కూడికకు సోదరులు పి.యన్.ఆర్. జయపాల్ (ర్యాలి) గారు అధ్యక్షతవహించిరి. యన్. సోల్మన్‌రాజు (ఖమ్మం), యం. ప్రభుదాస్ (ముంగండ), టి.వి.యన్. కుమార్ (తూరంగి), జి. బాబ్జీ (ఆరికరేవుల), యస్. జాన్ (డైరక్టర్, బిక్కవోలు బైబిలు స్కూలు), జాషువా గూటం (కాకినాడ), తదితర్లు పౌలు యొక్క సువార్త పరిచర్య విధానమును లేఖనముల నుండి వివరించిరి.

పౌలు నిష్టగల యూదుడు. ధర్మశాస్త్ర పండింతుడు. ఆసక్తిగల పరిసయ్యుడు. సత్యాన్వేషి. మంచి మనస్సాక్షి తోనే క్రైస్తవులను హింసించాడు. క్రీస్తును గూర్చిన సత్యాన్ని తెలిసికొనగానే మారుమనస్సు బాప్తిస్మము పొందాడు. క్రీస్తు శిష్యుడయ్యాడు. అనేకులకు కంటకుడయ్యాడు. అందువలన ప్రతిచోట యూదులు అతని చంపజూచారు. గాని ధైర్యముతో యేసేక్రీస్తనని గొప్ప సత్యాన్ని యూదులకు, ముఖ్యముగా అన్యజనులకు ప్రకటించాడు. తానే హింసింపబడ్డాడు. చివరకు హతసాక్షిగా మరణించాడు. సువార్త విషయమై అతడు పలు ప్రాంతములకు పయనించాడు. ధనాపేక్షలేనివాడు. స్వంత చేతులతో పరిచర్య చేసికొంటూ సువార్తను చాటాడు. క్రొత్తనిబంధనలో 14 పుస్తకములు అతని చేతివ్రాతలే. గొప్ప యోధుడు, మనకు మార్గదర్శి అని సహోదరులు హెచ్చరించారు. హాజరైన వారందరికీ బిక్కవోలు బైబిలు స్కూలు డైరక్టర్ యస్. జాన్‌గారు మంచి భోజనము నేర్పాటుచేసిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ గారి ప్రార్ధనతో నాటి సహవాస కూటము ముగిసెను.

ఏప్రియల్ 28,29,30 తేదీలలో విశాఖపట్టణం పెదగదిలి క్రీస్తు సంఘము సువార్త మహాసభలను తోటగరువు (ఆరిలోవ) జెడ్.పి. హైస్కూలు ఆవరణము నందు ఏర్పాటుచేసిరి. ప్రతిరాత్రి వందలాది ప్రజలు వచ్చి సత్యవాక్యము ఉపదేశించ బడుచుండగా వినిరి. ఆ సభలలో సోదరలు సి.హెచ్. జేకబ్ (బెంగుళూరు), బి. జాషువ (ఏలూరు), బి. జీవన్ బిషాప్ (విజయవాడ), పి. నాగభూషణం (జంగారెడ్డి గూడెం), వి. సహదేవ్

(తాడేపల్లిగూడెం) మరియు జాషువా గూటం గార్లు వాక్యపరి చర్యలో తోడ్పడిరి. ప్రతిరాత్రి యేసుక్రీస్తును గూర్చిన రంగుల చలనచిత్రం ప్రదర్శించ బడెను. పెదగదిలిలోను పరిసర ప్రాంతములలోను సోదరులు పరువు ఐజక్ గారు సువార్త చాటుచు క్రీస్తు కొరకు గొప్ప కార్యములు తలపెట్టుచున్నారు. సువార్త మహాసభలు జయకరముగా నడిపించినందుకు సోదరులు ఐజక్ గారు అభినందనీయులు.

ఏప్రియల్ 29,30 మరియు మే 1వ తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం అగ్రహారంలో సువార్త కూటములు జరిగెను. ఆ కూటములలో సోదరులు జాన్ మోషే, పి.డి. బిషప్, పి.యన్.ఆర్. జయపాల్, భాస్కరపాల్, టి. ప్రసన్నకుమార్, జాన్ విక్టర్, కె. జాన్‌ప్రసాద్ మరియు జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. కూటములలో మే 1వ తేదీ మధ్యాహ్నం ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అగ్రహారం, ఓదూరు సంఘస్థులు వారికి వాక్యపరిచర్య చేయుచున్న సోదరులు పి. సుందర్రావ్ గారిని, వారి సతీమణిని ఘనముగా సన్మానించి వస్త్రములను బహూకరించిరి. ఆ ప్రాంతములలో సోదరులు పి. సుందర్రావ్ గారు 25 సంవత్సరముల నుండి నిర్విరామ కృషి చేయు చున్నారు.

*****

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002.

From:
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.